ప్రజాశక్తి
శుక్రవారం 14 నవంబర్ 2025 5 అనంతపురం

కాంట్రాక్టర్ ప్రోద్బలంతోనే విలేకరులపై అక్రమ ఫిర్యాదు

ప్రజాశక్తి - చిలమత్తూరు

స్థానిక టిడిపి నాయకుడు నాగరాజు యాదవ్ అతని కుమారుడు హరీష్ యాదవ్ నీచ రాజకీయాలకు తెరలేపారు. ప్రజాశక్తి విలేకరి శంకర్ పై దాడులు చేసి గాయపరిచిన నాగరాజు యాదవ్, అతని కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో విలేకరులను లక్ష్యంగా చేసుకున్న టిడిపి నాయకుడు నాగరాజు యాదవ్ నిస్సిగ్గుగా అమాయకులైన ఎస్సీలను అడ్డం పెట్టి వారిచేత గురువారం ఇతరుల ఫిర్యాదు చేయించారు. ఏ శ్రద్ధ అంశం లో అయితే కథనాలు ప్రచురితమయ్యి విలేకరిపై దాడి ఘటన చోటు చేసుకుందో, అదే రహదారికి ఇసుక తరలిస్తున్న తనపై ప్రజాశక్తి విలేకరి శంకర్ తో మరో పత్రిక విలేకరి దాడి చేశారని ఓ ఎస్సీ వ్యక్తితో ఫిర్యాదు చేయించాడు. ఈ వ్యవహారంతో టిడిపి నాయకుడి కుట్ర బహిర్గతమైంది. ప్రజాశక్తి విలేకరి శంకర్‌కి ఫిర్యాదు చేసిన వ్యక్తితో కనీసం పరిచయం కూడా లేదు. ఇక అతని పై దాడి చేయాల్సిన అవసరం ఏముంటుంది? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇప్పటికే ప్రజల్లో అబాసుపాలైన టిడిపి నాయకుడు నాగరాజు యాదవ్ తనపై కేసు నమోదు కావడం తో కక్ష సాధింపు చర్యలకు దిగాడని స్థానికులు విమర్శిస్తున్నారు.

'పట్టు' జారింది...

పట్టు గూళ్లు రాక పోవడంతో బోసిపోయిన మార్కెట్

పట్టుగూళ్లు రాక మార్కెట్ వెలవెల
విడుదల కాని ఇన్సెంటివ్
పట్టించుకోని ప్రభుత్వం
ఇబ్బందుల్లో రైతులు

ప్రజాశక్తి-హిందూపురం

'మాది రైతు ప్రభుత్వం..రైతుల సంక్షేమం మా లక్ష్యం' ఇలా ప్రతి రాజకీయ పార్టీ నాయకుడు అనే మాట. అధికారంలో ఉన్న టిడిపితో పాటు ప్రతి పక్షంలో వైసిపి ప్రతి సమావేశంలోనే చెప్పే మాటలు. రైతు సంక్షేమమే తన లక్ష్యం అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు పట్టు రైతులను పట్టించుకోలేదు. దీంతో 2019 నుంచి ఇప్పటి వరకు పట్టు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ విడుదల చేయలేదు. ఇన్సెంటివ్ విడుదల చేయాలని పదుల సార్లు ప్రభుత్వ పెద్దలను కలసిన ప్రయోజనం దక్కలేదు. దీంతో పట్టు రైతులు ఆగ్రహించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద పట్టు గూళ్ల మార్కెట్ గా ప్రసిద్ధిగాంచిన హిందూపురం మార్కెట్ కు రైతులు బుధవారం ఒక్క లాటు సైతం పట్టు గూళ్లు తీసుకు రాక పోవడంతో మార్కెట్ బోసిపోయింది. గురువారం కేవలం 15 లాట్లు మాత్రమే వచ్చాయి. ఈ నేపథ్యంలో పట్టు రైతు సంఘం నాయకులు జయరామిరెడ్డి, సిద్దారెడ్డి, చైతన్య గంగిరెడ్డి తదితరులు ప్రభుత్వతీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు అమాంతంగా పెరగడంతో...రైతులు తక్కువ పెట్టుబడి ఉండే పట్టు సాగుకు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దీంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుశనగ, మొక్కజొన్న ప్రధాన పంటలు. వీటి తరువాత ప్రత్యామ్నాయ పంట ఏదైనా ఉందంటే అది పట్టు సాగు అని చెప్పవచ్చు. హిందూపురం పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాల్లో ఎక్కువగా పట్టు పంట సాగు జరుగుతుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పట్టు జారింది. రైతులకు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన ఇన్సెంటివ్ 2019 నుంచి విడుదల కాక పోవడంతో రైతులు ఇన్సెంటివ్ కోసం పట్టు గూళ్ల మార్కెట్ బంద్ చేసి నిరవధిక దీక్షలు చేపట్టారు. అయినప్పటికి ప్రభుత్వం పట్టు రైతుల ఆవేదనను అర్థం చేసుకోలేదు. ఇన్సెంటివ్ విడుదల చేయలేదు. దీంతో ఇక్కడ పండించిన పట్టును రైతులు కర్నాటక రాష్ట్రానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్ చరిత్రలోనే ఎప్పుడు లేని విధంగా బుధవారం స్థానిక మార్కెట్‌కు ఒక్క లాటు పట్టు రాలేదు. దీంతో దీనిపై ఆధారపడిన రీలర్లు, ఇదే పనిని నమ్ముకుని జీవనం చేస్తున్న వేలాది కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయింది. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు ప్రతి రోజూ 12 నుంచి 15 టన్నుల పట్టుగూళ్లు వస్తున్నాయి. రోజుకు రూ. 40లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు లావాదేవీలు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి గత సంవత్సరం రూ.1.27 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రూ.95లక్షలు ఆదాయం వచ్చింది. దీనికి ప్రతిఫలంగా రైతులు పండించిన పంటకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా సిబికి రూ.10, బైవోల్టీన్‌కు రూ.50 అందిస్తోంది. అయితే ఇది కూడా ఇక్కడ సరిగా ఇవ్వడం లేదు. తెలంగాణలో బైవోల్టీన్‌కు రూ.75 ప్రోత్సాహకంగా ఇస్తున్నారు. ఇక్కడ రైతులకు ప్రోత్సాహకం క్రింద కేజీకు సిబికి రూ.150, బైవోల్టీన్‌కు రూ.200 ప్రభుత్వం అందిస్తే రైతులకు కాస్తా ఉపశమనం లభిస్తుందనేది పట్టు రైతు సంఘం నాయకులు, పట్టు రైతులు అంటున్నారు. అదేవిధంగా రీలర్లకు ఒక కేజీ పట్టుదారం తయారు చేసి విక్రయిస్తే దానికి ప్రోత్సాహకం క్రింద రూ. 130 ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మల్టీయన్ రీలర్లకు కేజీకి రూ.130 నుండి 200రూపాయల వరకు, చర్కా రీలర్లకు రూ.35 నుండి 100రూపాయలకు పెంచి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రీలర్లు ఎక్కువ శాతం ముస్లిం మైనార్టీలకు చెందిన వారు ఉన్నారని అందరికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రీలింగ్ యూనిట్లు, ట్విస్టింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి రాయితీ రుణాలు ఇవ్వాలని. సోలార్ సిస్టమ్ ద్వారా యూనిట్ల బాయిలర్లకు విద్యుత్ సరఫరా కల్పించాలని కోరుతున్నారు. పట్టు రైతులతో పాటు రీలర్ల సమస్యలు పరిష్కరిస్తే పట్టుకు హిందూపురంలో పూర్వ వైభవం వస్తుందని రైతులు, రీలర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.80 కోట్ల మేర నిలచిన ఇన్సెంటీవ్‌లు

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 7 పట్టు గూళ్ల మార్కెట్లు ఉన్నాయి. ఇందులో హిందూపురం, పలమనేరు మార్కెట్లు పెద్దవి. దీంతో పాటు అనంతపురం జిల్లాలో కదిరి, ధర్మవరం, చిత్తూరు జిల్లాలో కుప్పం, మదనపల్లి మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్లలో పట్టు గూళ్లు విక్రయించిన పట్టు రైతులకు ఒక కేజీ బైవోల్టీన్ పట్టు గూళ్లకు రూ.50, సిబికు రూ.10 ఇన్సెంటివ్ ఇస్తుంది. దీంతో పాటు రీలర్లకు ఒక కేజీ దారం తీసి విక్రయిస్తే వారికి రూ.150 ఇన్సెంటివ్ ఇస్తుంది. ప్రభుత్వం పట్టు రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు 2019 ఆగస్టు నుండి ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లోనే దాదాపు రూ.40కోట్లు, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.80 కోట్లు పట్టు రైతులకు, రీలర్లకు ఇన్సెంటివ్ రావాల్సి ఉంది. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే టిడిపి ప్రభుత్వం పట్టు రైతులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు పెద్ద ఎత్తున వినపిస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం రైతులకు,రీలర్లకు ఇచ్చే ఇన్సెంటీవ్‌లను ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చరిత్రలో ఎప్పుడూ లేదు

హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌కు చరిత్రలో పట్టుగూళ్లు రాని పరిస్థితి ఎప్పుడూ లేదు. ప్రభుత్వం పట్టు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు బకాయి ఉన్న ప్రోత్సాహకాలు అందించాలి. రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకం పెంచాలి. లేని పక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాము.

జయరామిరెడ్డి,
పట్టు రైతు సంఘం నాయకులు

ఇలాగే కొనసాగితే రోడ్డున పడతాం

హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ నమ్ముకుని 160 మంది పట్టు రీలర్లు, దాదాపు 300 మంది చరఖా రీలర్లు జీవనం చేస్తున్నాము. మాతో పాటు ఇదే వృత్తిని నమ్ముకుని దాదాపు వెయ్యి కుటుంబాలు జీవనం చేస్తున్నాయి. సకాలంలో పట్టుగుళ్లు లభించకపోతే అందరికీ ఉపాధి లేక కుటుంబాలన్నీ రోడ్డున పడాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

ముస్తఫా,
రీలర్ల అసోసియేషన్ కార్యదర్శి

ప్రతి నెలా వివరాలు అందిస్తున్నాం

హిందూపురం మార్కెట్‌లో పట్టును విక్రయించిన రైతుల వివరాలను ఏరోజుకు ఆరోజు పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదికలను అందజేస్తాం. దీంతో పాటు ఇన్సెంటీవ్ విడుదల చేయాలని అధికారులను కోరుతున్నాము. 2019 నుంచి బకాయిలు రావాల్సి ఉంది.

హంపయ్య,
మార్కెట్ అధికారి

పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
జెడ్పీ సిఇఒ శివశంకర్

ప్రజాశక్తి - ఆత్మకూరు

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అనంతపురం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శివశంకర్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని సిద్దరాపురం గ్రామపంచాయతీని తనిఖీ చేశారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు చేస్తున్న చెత్త సేకరణను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. సేకరించిన చెత్తను సరిగా తీసుకుపోతున్నారా.. దానిని సరైన పద్ధతిలో విడదీస్తున్నారా.. అని ఆరా తీశారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని శుభ్రమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, స్థానిక నాయకులు శశాంక్ చౌదరి, గ్రామ సర్పంచి, ఉప సర్పంచి ఎగ్గిడి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ మాజీ విసి మృతి

ప్రజాశక్తి - అనంతపురం రూరల్

ఎస్కేయు మాజీ విసి శుభ(ఫైల్‌ఫోటో)

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ శుభ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈమె గతంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగ ప్రొఫెసర్ గా, విభాగాధిపతిగా, సిడిసి డీన్ , రెక్టార్, ఇన్‌ఛార్జి ఉపకులపతిగా సేవలందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న శోభ గురువారం ఉదయం హైదరాబాదులో మృతి చెందారు. శుభ భర్త ప్రొఫెసర్ చౌడోజి రావు ఎస్కేయూ పాలిమర్ సైన్స్ విభాగ ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఇటీవల సీఈజ్ ఉమెన్ ఇన్ కెమిస్ట్రీ అనే లండన్ కు చెందిన పుస్తకంలో శుభ ఫోటో ప్రచురితమైంది. ప్రపంచవ్యాప్తంగా 30 మంది మహిళ కెమిస్ట్రీ ప్రొఫెసర్లలో ఈమెకు చోటు లభించింది. శుభ అంత్యక్రియలు అనంతపురం శారద నగర్, శుభ నిలయంలో శుక్రవారం జరుతాయని ఆమె భర్త ప్రొఫెసర్ చౌడోజిరావు తెలిపారు. శుభ మృతి వార్త తెలుసుకున్న పలువురు సంతాపం ప్రకటించారు. జేఎన్టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, ఒఎస్‌డి ప్రొఫెసర్ దేవన్న, ఎస్కేయూ ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ అనిత, రెక్టార్ ప్రొఫెసర్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రర్ ప్రొఫెసర్ సుధాకర్ బాబు, ప్రొఫెసర్ దశరథ రామయ్య, ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప, బీసీ ఉద్యోగ సంఘ కార్యదర్శి మల్కారి లక్ష్మణరావు, టైం స్కేల్ సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, వికలాంగుల సంఘ ఎస్కేయూ అధ్యక్షుడు పెద్దన్న, ప్రొఫెసర్లు నాన్ టీచింగ్ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

27,28న ఎపి రైతు సంఘం జిల్లా మహాసభ
పోస్టరు ఆవిష్కరించిన నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నవంబర్ 27,28, తేదిల్లో గార్లదిన్నెలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం అనంతపురం గుత్తి రోడ్డు మార్కెట్ యార్డ్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

జిల్లా రైతు సంఘం నాయకులు, జిల్లా నలుమూలల నుండి రైతు ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ఈ మహాసభలో జిల్లాలోని రైతాంగ సమస్యలపై తీర్మానాలు ఆమోదించడంతోపాటు నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని చెప్పారు. ఈ మహాసభలో జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 27న గార్లదిన్నెలో రైతులతో ర్యాలీ బహిరంగ సభ ఉంటుందన్నారు. 28న ప్రతినిధుల సభ, నూతన కమిటి ఎన్నిక ఉంటుందన్నారు. కావున జిల్లాలోని రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, బిహెచ్.రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, వలీ, సంజీవరెడ్డి, సుబ్రమణ్యం, రవితేజ రెడ్డి, బి.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులన్నీ నింపుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్లూరు

నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలియజేశారు. గురువారం మండలంలోని సుబ్బరాయ సాగర్ నుంచి నీటిని ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 మీటర్ల సామర్థ్యంతో నీటిని నిల్వ చేసి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల చెరువులను నింపుతామన్నారు. 29వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా చివరి ఆయకట్టు బొప్పేపల్లి చెరువుకూ నీరు చేరుతుందని చెప్పారు.

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడగులు వేస్తుంటే వైసిపి రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. 13వ తేదీన నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించినా రైతులు, ప్రజలను అయోమయంలోకి నెట్టేలా ఎప్పుడు నీళ్లు వస్తాయి అంటూ వైసిపి నాయకులు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. కోమటికుంట్ల కులశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్ రెడ్డి హెచ్ ఎల్ సి అధికార చొరవతో సుబ్బరాయుడు సాగర్‌కు నీరు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ అధ్యక్షురాలు ప్రమీలమ్మ, పుట్లూరు సింగల్ విండో అధ్యక్షుడు కడవకల్లు రాజు, కందికాపల సర్పంచి శివరామయ్య, టిడిపి నాయకులు ఎల్‌కె. చెన్నారెడ్డి, సుదర్శన్ నాయుడు, బ్రహ్మయ్య, శివారెడ్డి, వాసుదేవ రెడ్డి, రవికుమార్, చింతకుంట నాగేష్, ఓబులాపురం ప్రసాద్, తక్కలపల్లి రంగయ్య గోపాల్ రెడ్డి, అరగటివేముల రంగయ్య, బాలాపురం రామచంద్రారెడ్డి, రవికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎదుట ఆందోళన
తాకట్టు బంగారమివ్వాలని బాధితుల నిరసన

ప్రజాశక్తి -అనంతపురం

నగరంలోని మారుతీనగర్ 80 అడుగుల రోడ్డులోనున్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎదుట బాధితుల నిరసన రెండో రోజూ కొనసాగింది. గురువారం ఉదయం నుంచి బ్యాంకు ఎదుట బాధితులు నిరసన చేపట్టారు. బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం మాయమవడంపై బాధితులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం చేపట్టిన ఆందోళన గురువారం కూడా కొనసాగింది. బ్యాంకు సమయంలో బాధితులు ఆందోళనకు దిగారు. దీంతో బ్యాంకుకు తాళాలు వేసి కార్యకలాపాలు కొనసాగలేదు. బాధితుల్లో ఒక మహిళ పురుగుల మందు తెచ్చుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన కూతురు బంగారం తమ అవసరాలకు తాకట్టు పెట్టుకున్నామని చెప్పింది. దాన్ని విడిపించుకుందామని చూస్తే తాకట్టు పెట్టిన బంగారం బ్యాంకులేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారన్నారు. ఐదు మాసాలుగా తమ బంగారం తమకివ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తరహాలో తక్కిన వారు కూడా ఆందోళనకు దిగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. బ్యాంకు అధికారులను పిలిపించి పరిష్కారం చూపాలని కోరారు. బ్యాంకు అధికారులు అక్కడికి విచ్చేసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. న్యాయం చేస్తామని బ్యాంకు అధికారులు చెప్పినా బాధితులు వినలేదు. తమకు స్పష్టమైన లిఖితపూర్వక హామీనివ్వాలని కోరారు. ఈ నిరసన మధ్యాహ్నం వరకు కొనసాగింది. చివరకు సిఐ జగదీశ్, వెంకటేశ్వర్లు కలుగజేసుకుని బాధితుకులకు నచ్చజెప్పి పంపించారు.

కెజిబివి పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలను ఎంపీడీవో మమతా దేవి మండల విద్యాధికారి నారపరెడ్డితో కలిసి సందర్శించారు. పాఠశాలలో అన్ని గదులు తిరిగి పరిశీలించారు. వసతులు, భోజనం తదితర వాటిపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. క్రీడామైదానంలో రాత్రి సమయంలో ఆకతాయిలు మద్యం సేవించి కేకలు వేస్తున్నారని విద్యార్థులు ఎంపిడిఒ దృష్టికి తెచ్చారు. ఎస్ఐతో మాట్లాడి రాత్రి సమయంలో గస్తీ ఏర్పాటు చేయిస్తామన్నారు. పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచడానికి ఎస్ఎస్ఎ ఇంజినీరింగ్ అధికారులకు నివేదిక పంపుతామని ఎంపిడిఒ తెలిపారు. ఈ నెల 15వ తేదీన బాలుర పాఠశాల క్రీడా మైదానంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నూతన ఆవిష్కరణల దిశగా ఎస్ఆర్ఐటి ఒప్పందాలు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాల హైదరాబాద్ టి-హబ్ వద్ద జరిగిన ఫస్ట్ జెన్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2025 సందర్భంగా ఫస్ట్స్, ఇండో యూరో సింక్రోనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల ఆవిష్కరణలు, పారిశ్రామికత, డిజిటల్ మార్పు, మార్గదర్శకత్వం, నెట్‌వర్కింగ్, స్టార్టప్ నిధులను పొందే అవకాశం ఉంటుందని కళాశాల ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ డా॥బి.అంజనేయులు తెలిపారు. విద్యార్థులు సొంత స్టార్టప్ ప్రారంభించడానికి, కొత్త ఆవిష్కరణలు చేయడానికి, జర్మనీ ఇన్నోవేటర్లతో అనుసంధానం అవడానికి, స్టార్‌అప్ నిధులు పొందడానికి సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్, ఇండో యూరో సింక్రనైజేషన్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఫస్ట్ జెన్ ఆసియా పసిఫిక్ రీజియన్ రాజ్ వంగపండు, ఫస్ట్ జెన్ వ్యవస్థాపకుడు, సీఈఓ ఫిలిప్ అస్సుమస్, ఎస్ఆర్ఐటి వైస్ ప్రెసిడెంట్ డా॥రంజిత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా॥బాలకృష్ణ, డా॥బి.అంజనేయులు డా॥మహబూబ్ పీరా పాల్గొన్నారు.

స్త్రీనిధి రికవరీలో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మహిళా సంఘం సభ్యుల ఆర్థిక పరిపుష్టికోసం మంజూరుచేసిన స్త్రీనిధి నిధుల రికవరీలో నిర్లక్ష్యాన్ని సహించబోమని వెలుగుడీజీఎం శశికుమార్ హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం లీగల్‌సెల్ కోఆర్డినేటర్ గోవిందరాజులు, స్త్రీనిధి మేనేజర్ తాహీర్, ఏపీఎం నారాయణస్వామి, మండల సమైక్య అధ్యక్షురాలు అనుషాలతో కలిసి సమీక్ష నిర్వహించారు. కళ్యాణదుర్గం మండలంలో రూ.కోటిలు స్త్రీనిధి నిధులు రీకవరీచేయాల్సుందన్నారు. చాలా ఏళ్లుగా నిధులు రీకవరీలేక సంఘాల సభ్యుల అభివృద్ధికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గ్రామాల వారిగి యానిమోటర్లతో ఎంత మేరకు స్త్రీనిధి నిధులు రీకవరీచేయాలనే విషయాల పై చర్చించారు. కనీసం సంఘం సభ్యులను కలిసి రీకవరీ పై దృష్టిసారించినట్లు ఏమాత్రం కనిపించడంలేదని డీజీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు సంఘం సభ్యులతో సమావేశమై ప్రణాళికలు సిద్ధంచేసుకుని బకాయి స్త్రీనిధి రికవరీ చేయాలని ఆదేశించారు. అనంతరం డీజీఎం మాట్లాడుతూ స్త్రీనిధిని రీకవరీ చేయడంలో వెలుగు సిబ్బంది నిర్లక్ష్యంచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సెల్‌టవర్ తొలగించండి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

పట్టణంలోని తిలక్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాలను ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ తిలక్ నగర్ రజక వీధి

సమస్యను అధికారులకు వివరిస్తున్న నాయకులు

ప్రాంతంలో నీలకంఠ రెడ్డి ఇంటిపై ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనివల్ల చుట్టుపక్కల ఉన్న ప్రజలు, కిండర్ గార్డెన్ ప్లే స్కూల్‌లో ఉన్న చిన్న పిల్లలపై రేడియేషన్ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దీని ఏర్పాటును అడ్డుకోవాలని నెల రోజులుగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, టెలికాంశాఖ అధికారులు స్పందించి టవర్ ఏర్పాటును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, సురేంద్రబాబు, రంగమ్మ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వైటిచెరువు రమేష్, తిలక్ నగర్ రజక వీధి ప్రాంత వాసులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన కొండిశెట్టి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల జనసేన నాయకులు కొండిశెట్టి ప్రవీణ్ కుమార్ విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శింగనమల్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో జరుగుతున్న నియోజకవర్గ అభివృద్ధి పనులను తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని ప్రవీణ్‌కుమార్ కోరారు.

లోకేష్‌తో ప్రవీణ్‌కుమార్

నేటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలం పరిధిలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 14 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బాలాజీ రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రీసర్వేపై ప్రజలకు అపోహలు తొలగించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 14న గార్లదిన్నె అత్తిరాలదిన్నె, పెండేకల్లు, 15న జోడి ధర్మాపురం, తబ్జుల, చాగల్లు, 17న ధర్మాపురం, పప్పూరు, దేవునిఉప్పలపాడు గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-యల్లనూరు

సబ్ స్టేషన్ పరిధిలో 33కేవీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఈ నెల 15వ తేదీ శనివారం విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పద్మనాభ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం 5గం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగ దారులు అధికారులు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

డిజిటల్ పంట నమోదు పూర్తి

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ 2025 సీజన్‌కు సంబంధించిన సర్వే నెంబర్లు, సాగు చేసిన పంటలు, బీడు భూముల వివరాలపై డిజిటల్ పంట నమోదు పూర్తి అయిందని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పరిశీలన కోసం రైతు సేవా కేంద్రాల్లో సోషల్ ఆడిట్‌కు ఉంచామన్నారు. జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే మూడు రోజుల్లో సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు.

17న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ క్లీనిక్‌లో ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దేవి మెడికల్ స్టోర్ యజమాని రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సంతమార్కెట్‌కు వెళ్లే దారి, చర్చ్ ఎదురుగా, బాలాజీ క్లీనిక్‌లో డా॥హరి బాబు నాయక్, డా॥తరుణ్ నాయక్, టి.ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీపీ, షుగర్, హీమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్, బరువు, పల్స్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. మందులు కూడా ఉచితంగా ఇస్తామన్నారు.

జిల్లా అధికార ప్రతినిధిగా నరసింహులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామానికి చెందిన నరసింహులును నాయీబ్రాహ్మణ సంఘం అనంతపురం జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 11,12 వ తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం కార్య వర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాల గురుస్వామి ఆధ్వర్యంలో నరసింహులును జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపిక చేశారన్నారు. విట్లంపల్లి భజంత్రి తిమ్మప్పను అనంతపురం జిల్లా ఉపాధ్యాక్షులుగా ఎన్నుకున్నామన్నారు.

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P.No:127/2024 in ARB Case No: ARC/FSBFL/1120

Between:
M/S. Five Star Business Finance Limited, Ananthapur Represented by its Authorized Signatory, Y.Shyam Prasad, Ananthapur.
...Petitioner/ D.HR

V/S

J.Dr1: Bugude Manoj Kumar S/O Bugude Nagaraju,, business, D.No.1-132, D.Hirehal Village and Mandal, Anantapur Distict.
J.Dr2: Bugude Lalitha W/O Bugude Nagaraju, D.No.1-132, D.Hirehal, Anantapur District.
...Respondants /J.DRS

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Drsకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నారు. వేలములో పాల్గొనదలచినవారు **03-12-2025**వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

The property is situated in R.D Anantapur and SRD of Rayadurgam, within the fields of D.Hirehal Village and Gram Panchayat, D.Hirehal Mandal, Anantapur DistrictSy.No. 406/2A, Extent; 94.44 sq yards,D.No; 3/12,Asst.No; 364,Boundaries:East by: Land of Thippeswamy, West by: Bugade Narayanappa's House, North by:Road and South by: Land of Thippeswamy.Measurements:East-West-34 feet or 10.21 meters and North-South-25 feet or 7.51 meters. totally measuring 94.44 sq yards.
DHr Value Rs.2,50,000/-
Ameen value,Rs:4,87,500/-

(By Order of the Court)
M.SURESH KUMAR,
Advocate, Ananthapuramu.
Cell: 9441168233

SREE SAI SIDDARTHA COLLEGE OF EDUCATION
RAVIVENKATAM PALLE(V), TADIPATRI (M) ANANTAPUR DiSt).
Email: sreesaisiddartha.principal@gmail.com.

ADMISSION NOTIFICATION FOR SPOT (CATEGORY-A) and MANAGEMENT QUOTA (CATEGORY -B) 2025

Institutional Spot Admissions and cat 'B' (Management Quota) Admissions on 15-11-2025

The EDCET-**2025** Qualified/ Not qualified/ Not appeared in CET candidates are hereby informed that the institutional spot admissions (Category -A) and Management Quota (Category -B) admissions will take up on **15-11-2025** as Per APSCHE Notification Schedule for the academic year **2025-2027**

Interested candidates may apply on or before 15-11-2025

Eligibility: 50% Aggregrate in Degree / PG(OC),
40% Aggregrate in Degree/ (BC/SC/ST)
EDCET-**2025** Qualified/Not qualified.

Further details contact: **9652042689,9390857940**

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమ

పోస్టర్లు విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 14వ తేది నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమ తెలిపారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం కార్యదర్శి ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో వారోత్స వాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న వారోత్సవాల ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్.రంగ నాథన్, పాతూరి నాగభూ షణం, అయ్యంకి వెంకటరమయ్య, గడిచేర్ల హరిసర్వోత్తమరావుల స్మరణ, 17న కవిసమ్మేళనాలు, సెమినార్, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రాలేఖనం, వకత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ముఖ్య అతిథుల చేతుల మీదుగా వివిధ రకాలైన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజే యనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ చేతుల మీదుగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, సిబ్బందితో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, గోవిందు, సహాయ గ్రంథాలయాధికారి ముత్యాలమ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఖరీఫ్ ఈ-పంట జాబితా ప్రదర్శన

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

జాబితాను చూసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఖరీఫ్-2025కు సంబంధించి రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 100 శాతం అన్ని సర్వే నెంబర్లకు సంబంధించి పంటల సాగు, బీడు భూముల ఈ క్రాప్‌ను నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వమ్మ తెలిపారు. ఈ నెల 13వ తేదీ జిల్లా వ్యాప్తంగా ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 100శాతం సర్వేలో భాగంగా 9,67,081 సర్వే నెంబర్లకు గాను 8,37,705 సర్వే నంబర్లను సర్వే చేశామన్నారు. మిగలిన 1,29,376ను సర్వే చేసి రైతు సేవా కేంద్రం సిబ్బంది లాగిన్‌లో బీడు భూములు, వ్యవసాయేతర భూములుగా గుర్తించి మార్కింగ్ విధానంలో మార్క్ చేశామన్నారు. దీనికి సంబంధించి 19,01,538 ఎకరాల విస్తీర్ణంను నమోదు చేశామన్నారు. ఇందులో వ్యవసాయ పంటలు 8,64,137 ఎకరాలు, ఉద్యానవన పంటలు 3,14,885, ఎకరాలు, సెరికల్చర్ 1,281 ఎకరాలు, బీడు, వ్యవసాయేతర భూములు 7,21,234 ఎకరాలు ఉన్నట్లు నమోదు చేశామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లాలలోని అన్ని గ్రామాల్లో ఈ ముసాయిదా జాబితాను ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ప్రదర్శిస్తామన్నారు. గ్రామసభలు నిర్వహించి జాబితా వివరాలు తెలియజేస్తామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభల్లో రైతులు ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

కార్మికుల పొట్టకొడితే సహించం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వినతిపత్రం ఇస్తున్న మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు

సుదీర్ఘకాలంగా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందిస్తున్న సూపర్‌వైజర్లు, కార్మికుల పొట్ట కొట్టేందుకు గుత్తేదారులు పూనుకున్నారని ఈ చర్యలు మానుకోకపోతే సహించేది లేదని మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీ నర్సయ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ముర్తుజ, అధ్యక్షులు నల్లమ్మ మాట్లాడుతూ కాంట్రాక్టర్ అనవసర నిబంధనలు అమలు చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై కార్మికులు గత ఆరు రోజులుగా నిరసన తెలియజేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక సభ్యులు ఏజీ.రాజమోహన్, సంఘం సభ్యులు నాగలక్ష్మి, కళావతి లక్ష్మీదేవి, శివకుమార్, దుర్గాప్రసాద్, గౌసియా, ప్రమీల, సంజీవ్, కుమార్, సుబ్బమ్మ, వన్నూరప్ప, బీబీ, కాంతమ్మ పాల్గొన్నారు.

నేడు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

రాయదుర్గం : తెలుగుదేశం పార్టీ రాయదుర్గం నియోజకవర్గం మండల, పట్టణ స్థాయి నూతన కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, కో యూనిట్ ఇన్‌ఛార్జులు బిఎల్ఎలు , కో బిఎల్ఎలు, గ్రామ, వార్డు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3:30 గం,లకు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నుంచి 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం మద్దానేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

యాడికి : యాడికి యుపిఎస్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ పి.జగదీష్ గురువారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణం, సిబ్బంది బ్యారెక్, లాక్‌అప్స్, రికార్డులు, ప్రాపర్టీ స్టోరేజ్ రూమ్, కేస్ డైరీ ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజా సేవా భావనపై ప్రత్యేక దష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్‌లో శుభ్రత, రికార్డుల పద్ధతిగా నిర్వహణ, ఆధునిక సాంకేతిక వనరుల వినియోగం, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాల మెరుగుదలపై మరింత శ్రద్ధ పెట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్, యాడికి సిఐ ఈరన్న పాల్గొన్నారు.

CHANGE OF NAME

B K YASASWANI (Old Name) D/O B.K Raghavendra Rao R/O. D.N0.20/344 near bhirappa Temple Street old guntakal Guntakal Anantapur district Andhra Pradesh 515801.Shall Henceforth be known as **BANDARU KAMMA BHARGAVI (New name)**. Vide affidavit dated on 07-11-2025 before notary by G Nagaraju advocate Guntakal.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE OF TADIPATRI
I.A No: 647/2024 in O.S No :297/2023

Between:
C.Nagaraju ...Petitioner/Plaintiff
AND
D.Vannuramma ...Respondent/Defendent

Notice to Respondent/Defendent to D.
Vannuramma W/o D.Balanasimhulu R/o in D.No. 16/476-1, Nandalapadu, Tadipatri- 515411.

పై అర్జీదారుడు మీ పైన ఫైనల్ డిక్రీ కొరకు పై అర్జీని దాఖలు చేసుకున్నాడు. పై అర్జీ మీ హాజరు నిమిత్తం 25-11-2025 వ తేదీన ఉదయం 10.30గంటలకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయంగా కానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆ క్షేపణలు ఉన్న యెడల తెలుపు కోవలేను. లేని యెడల పై I.A No:647/2024 మీ పరోక్షమున తీర్మానించదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
V.రామచంద్రారెడ్డి
K.శ్రీకాంత్
అడ్వకేట్స్, తాడిపత్రి
Cell: 6303559960

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

నిషేధిత మందులను విక్రయించొద్దు

ఉమ్మడి అనంతపురం జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఓ.వీర కుమార్ రెడ్డి

ఓ.వీరకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అనుమతులు లేకుండా ఔషధాలను విక్రయించినా, నిబంధనలు అతిక్రమించి వ్యవహరించినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి అనంతపురం జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఓ.వీరకుమార్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ పరిధిలో ప్రభుత్వ నిబంధన ప్రకారం అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో హెూల్‌సేల్, రిటైల్ వర్తకులకు ప్రభుత్వ నిబంధనలను తెలియజేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో ప్రధానంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జీఎస్టీ అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చేపట్టినట్లు చెప్పారు. జీఎస్టీ అమలయ్యే విధంగా తగు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతపురం జిల్లా పరిధిలో ఇద్దరు డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు, సత్యసాయి జిల్లా పరిధిలోని ఇన్‌ఛార్జులుగా కొనసాగుతున్నారన్నారు. అనంతపురం జిల్లాలో హెూల్‌సేల్‌లో 300 రిటైల్లో 1400, సత్యసాయి జిల్లాలో హెూల్‌సేల్‌లో 200 ఔషధ దుకాణాలు ఉన్నాయన్నారు. ఇదే క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 18 రక్తనిధి కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అమలులో జాప్యం చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఇప్పటివరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 230 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మందులను డాక్టర్ రసీదు లేకుండా ఇవ్వకూడద న్నారు. నిషేధిత మందులపై అవగాహనతో వ్యవహరించాలని తెలియజేశారు. ఔషధ దుకాణాల్లో ఫార్మ అనుభవం ఉన్నవారిని నియమించా లన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. చిన్నపిల్లల ఔషధాలను వైద్యుల రసీదు లేకుండా అమ్మరాదన్నారు. రక్తనిధి కేంద్రాల్లో నిర్ధారణ ప్రక్రియలను క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, నాణ్యత లేని, నిషేధిత మందులపై అనుమానం ఉన్నా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పామిడి

పోస్టర్లు విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

ఈ నెల 27, 28వ తేదీల్లో గార్లదిన్నెలో జరిగే రైతుసంఘం 13వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం సీనియర్ నాయకులు అనిమి రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ పిలుపునిచ్చారు. గురువారం నాడు మహాసభల కరపత్రాలను మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల్లో రైతు సమస్యలపై చర్చిస్తామన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు ఖర్చుకు అదనంగా 50శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు సాయికుమార్, లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, షాషావలి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మాబు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు భాష్యం విద్యార్థి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థినిని అభినందిస్తున్న భాష్యం సిబ్బంది

అనంతపురం భాష్యం విద్యాసంస్థలో చదువుతున్న కార్తీక్ ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వహించిన పోటీల్లో సత్తా చాటాడు. అండర్-11 పోటీల్లో కార్తీక్ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. కార్తీక్ తండ్రి మాట్లాడుతూ భాష్యం స్కూల్లో విద్యార్థులకు విద్యతోపాటు ఆటల్లో కూడా అక్కడ సిబ్బంది ప్రోత్సహిస్తున్నారని తెలియజేశారు. ఛైర్మన్ భాష్యం రామకష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్, అనంతపురం జిల్లా జడిఒ రవివర్మ, ప్రిన్సిపల్ బాలకృష్ణ తదితరులు విద్యార్థులు అభినందించారు.

హింసకు పాల్పడితే చర్యలు : ఎమ్మెల్యే

నార్పల : గ్రామాల్లో హింసాయుత చర్యలకు పాల్పడితే ఎంతటి వారినైనాఉపేక్షించమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హెచ్చరించారు. మండల పరిధిలోని నాయనపల్లి దళిత కాలనీలో ఇటీవల జరిగిన ఘర్షణపై ఆమె స్పందించారు. గురువారం ఆమె బాధితులను పరామర్శించారు. వైసిపి కార్యకర్తల ప్రేరేపణతోనే గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయన్నారు. గ్రామంలో స్థలం సమస్యపై పూర్తి స్థాయి విచారణ జరిపించామని వివాదానికి కారణం అయిన స్థలం ఆర్డీటీది కాదని, మాజీ సర్పంచి వెంకట్రాముడు, ఆయన తండ్రి ఓబులేసు కుటుంబం ఆధీనంలో ఉందన్నారు. దీనిపై వాస్తవాలు తెలుసుకోకుండా ఘర్షణలకు దిగడం సరికాదన్నారు. కావాలనే ఘర్షణలకు దిగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు.

సూక్ష్మసేద్యంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులకు సూక్ష్మసేద్యంపై అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారి రెడ్డిపల్లి శైలజ, జిల్లా సూక్ష్మ నీటి పారుదల శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథరెడ్డి తెలిపారు. తెలిపారు. వెలుగు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, డ్రిప్ కంపెనీ ప్రతినిధులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ రఘునాథరెడ్డి నీటి వసతి ఉన్న ప్రతి రైతుకూ డ్రిప్, స్ప్రింక్లర్ ఉపయోగాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై వివరించారు. డ్రిప్ కోసం నమోదు చేసుకున్న ప్రతి రైతు నుంచి సంబంధిత పత్రాలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌కు స్ప్రింక్లర్ 50 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పంట నమోదు వివరాలను సోషల్ గ్రామసభల ద్వారా రైతులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి ఇంజినీర్ శంకర్ రెడ్డి, ఎంఐఎలు శ్రీరాములు, హరిత, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు, యోగాతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

క్రీడలు, యోగా మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎస్కెయు రిజిస్ట్రార్ రమేష్ బాబు తెలిపారు. పట్టణంలోని ఎస్‌విజిఎం డిగ్రీ కళాశాలలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్‌తో పాటు స్పోర్ట్స్ అథారిటీ పర్సన్ డాక్టర్ జెస్సి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో వీడీ తిమ్మప్ప, ప్రొఫెసర్ రాధాకృష్ణ డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రవికుమార్, రుక్మిణి, ఈశ్వరయ్య గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం

ప్రజాశక్తి-బెలుగుప్ప

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్ఐ

భార్య మరొకరితో చనువుగా ఉంటోందన్న కారణంతో భర్త ఆమెను హత్య చేసిన ఘటన బెళుగుప్ప మండల కేంద్రంలోని బోయ వీధిలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ట్రైనీ ఎస్ఐ మహేష్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోయ వీధిలో ఆంజనేయులు శాంతి(26) నివసిస్తున్నారు. ఆంజినేయులు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో శాంతి మరో వ్యక్తితో చనువుగా ఉన్నట్లు భర్త గుర్తించాడు. దీనిపై పలుమార్లు భర్త భార్యను మందలించాడు. శుక్రవారం సాయంత్రం శాంతి మరోక వ్యక్తితో కలిసి ఉండడాన్ని భర్త ఆంజనేయులు చూశాడు. కోపంతో వెంటనే వేటకడులతో భార్య శాంతిని నరికి చంపాడు. అనంతరం నిందితుడు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. ట్రైనీ ఎస్ఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కర్నాటకవాసి కళ్యాణదుర్గంలో మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కర్నాటక రాష్ట్రంలోని వైఎన్ఎస్‌కోట గ్రామానికి చెందిన కిష్టప్ప (60) అనే వ్యక్తి కళ్యాణదుర్గంలో మృతిచెందాడు. కిష్టప్ప కొన్ని రోజులుగా ఆర్టీసీ బస్టాండ్‌లో నిద్రపోయేవాడు. రోజుమాదిరిగానే నిద్రపోయిన కిష్టప్ప గురువారం చలనం లేకుండా ఉండటాన్ని ఆర్టీసీ సిబ్బంది గమనించారు. పరిశీలించి మృతిచెందినట్లు అనుమానించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కిష్టప్పను ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు కిష్టప్ప మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపాలిటీ పరిధిలోలని ముదిగల్లు గ్రామానికి చెందిన దుర్గమ్మ (60) అనే వివాహిత కడుపునొప్పి తాళలేక బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు ఈవిషయాన్ని గమనించారు. దుర్గమ్మ గత కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుండేదని రోజుమాదిరిగానే రేకుల షెడ్‌లో నిద్రపోయిందని అదే రేకుల షెడ్‌లో చీరతో ఉరివేసుకుని వేలాడుతున్న విషయాన్ని గురువారం ఉదయం గమనించామని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. మృతురాలికి భర్త వీరనాగన్న, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై దాడి

ప్రజశక్తి -అనంతపురం

అనంతపురం జేఎన్టీయూలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి గా పనిచేస్తున్న శంకర్‌పై శుక్రవారం దాడి జరిగింది. పరిపాలన భవనం ప్రాంగణంలో బయట వ్యక్తులతో వచ్చి విచక్షణారహితంగా గురువారం దాడి చేశారు. ఇంటి వద్ద జరిగిన చిన్నపాటి ఘర్షణను సాకుగా చూస్తూ పోలీస్ శాఖకు ఓ ఉద్యోగి తన బంధువులతో కలిసి దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై వన్ టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

మరూరు రైతు సేవా కేంద్రంలో చోరీ

ప్రజాశక్తి -రాప్తాడు

రాప్తాడు మండలం మరూరు రైతు సేవ కేంద్రంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గురువారం ఉదయం విధులకు వచ్చిన మరూరు రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతు సేవ కేంద్రం ప్రధాన తలుపులు పగలగొట్టి ఉండడం గమనించారు. వెంటనే రాప్తాడు మండల వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్య దృష్టికి తీసుకెళ్లారు. ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్, ఏవోతో కలిసి చోరీ జరిగిన మారూరు రైతు సేవా కేంద్రం పరిశీలించారు. కేంద్రంలో ఉన్న టివి, కంప్యూటర్‌కు వినియోగించే యూపిఎస్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా, మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్, గుత్తి, గుంతకల్లు పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుకున్న నాటుసారా, మద్యం బాటిళ్లను గురువారం ఎక్సైజ్, సివిల్ అధికారులు ధ్వంసం చేశారు. గుత్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 48 కేసుల్లో 294.36 లీటర్ల నాటుసారా, 46 కేసుల్లో 100 లీటర్ల డిపిఎల్ మద్యం, ఎన్‌డిపిఎల్ కేసులోని 7.02 లీటర్ల కర్ణాటక మద్యం, గుత్తి పోలీస్ స్టేషన్ పట్టుబడ్డ డిపిఎల్ కేసుల్లో 10 లీటర్లు, ఎన్‌డిపిఎల్ కేసుల్లో 135 లీటర్ల కర్ణాటక మద్యం, ఐడీ కేసులో 11 లీటర్ల మద్యం, గుంతకల్లు వన్ టౌన్, టూ టౌన్, కసాపురం, పామిడి పోలీస్ స్టేషన్లో పట్టుబడ్డ మద్యంను గుత్తి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఆరుబయలు స్థలంలో ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.ఉమాదేవి, సిఐ పల్లా గోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండ్ రామ్మోహన్‌రెడ్డి, స్క్వాడ్ సిఐ జయనాథ్‌రెడ్డి, సివిల్ సిఐ ఎం.రామారావు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సి. వెంకటనారాయణ, కానిస్టేబుళు ,,పాల్గొన్నారు.

సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్



సైకిళ్లు పంపిణీ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

మండల పరిధిలోని ఉద్దేహాల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 32 మంది విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు కాలినడక కష్టాన్ని తగ్గించేందుకు సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య, స్కూల్ కమిటీ అధ్యక్షులు నారప్ప, టిడిపి నాయకులు, సొసైటీ ప్రెసిడెంట్ మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి తరలింపునకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఎర్రమట్టి తరలింపునకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, సిఐ పుల్లయ్య తెలిపారు. ట్రాక్టర్ యాజమానులు మైన్స్ అండ్ జియాలజీ శాఖ నుంచి అనుమతి తెచ్చుకోవాలన్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతితో మట్టి రవాణా చేయాలి : ఎమ్మెల్యే

మండల పరిధిలో మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులు ఆయా శాఖల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనింగ్, జియాలజీ శాఖల నుంచి అనుమతి పొంది, రాయల్టీ చెల్లించి, లీజు గల భూముల నుంచి మట్టిని తరలిస్తే ఎవరూ అడ్డు చెప్పరన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

అనంతపురం : ఎస్కె యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో గురువారం నాలుగవ రోజు "ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి పాఠశాల విద్యార్థులకు మంచి స్పర్శ - చెడు స్పర్శ, పర్యావరణ అనుకూల జీవనశైలి విధానం, వనరుల నిపుణులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

హుండీలెక్కింపు వాయిదా

ప్రజాశక్తి-శింగనమల

శివపురం పెద్దమ్మ అమ్మవారు హుండీ లెక్కింపును వాయిదా వేసినట్లు సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో హుండీ లెక్కింపు 15 రోజుల వరకు వాయిదా వేశామన్నారు. కాగా హుండీ లెక్కించాల్సిందే అంటూ కొందరు గ్రామస్తులు పట్టుబట్టారు. వీరికి సిఐ, ఎస్ఐ సర్ది చెప్పారు. ఎండోమెంట్ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించేలా ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.